సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

- ఎంపీ, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ వంగా గీత
- కొత్తపల్లిలో మండల సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత

కొత్తపల్లి: గ్రామాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీ వంగా గీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమర్పించారు. కొండెవరంలో తరచూ తాగునీటి సమస్య తలెత్తుతోందని, వారానికి రెండు సార్లు పైపులైన్లు మరమ్మతులకు గురవుతున్నాయని ఎంపీటీసీ సభ్యుడు దుళ్ల సత్తిబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ప్రధాన పంట కాలువలు గుర్రపు డెక్కతో మూసుకుపోవడంతో సాగునీరు సమస్య ఏర్పడుతుందని, దీంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ గీత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధులను సంపూర్ణంగా ఖర్చు చేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆరోగ్యశ్రీ ద్వారా అనేక మార్పులు తీసుకువచ్చారు. ప్రతి ఒక్కరికీ ఖరీదైన వైద్యాన్ని ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోందన్నారు. అంతేకాకుండా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో లబ్ధిదారుల ఇంటికే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల స్థలం మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి రుణాలను మంజూరు చేశారన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్లు చేసి ఇళ్ల పట్టాలు అందిస్తోందన్నారు. వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సరేష్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, ఎంపీడీఓ వెంకట నారాయణ, తహసీల్దార్ రాజ్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సముద్ర తాబేళ్లను వేటాడితే కఠిన చర్యలు


వరప్రసాద్

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు ఆలివ్ రిడ్లే తాబేళ్లను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ఆలివ్ రిడ్లే తాబేళ్లు తీరానికి వచ్చి గుడ్లు పెడతాయన్నారు. ముఖ్యంగా హోప్ ఐలాండ్ సమీపంలో వేట చేపట్టరాదని హెచ్చరించారు. ఈ తాబేళ్లను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తీరప్రాంత గ్రామాల్లో మత్స్యకారులకు దీనిపై అవగాహన కల్పిస్తామన్నారు. ఏప్రిల్ నెలాఖరు వరకూ హోప్ హైలాండు సమీపంలో వేటకు వెళ్లరాదన్నారు.

క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం


ఏలేశ్వరంలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఏలేశ్వరం: పట్టణంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక చిరంజీవి మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌లో డాక్టర్ కె.వరప్రసాద్ ఆధ్వర్యంలో అలమండ వీరరాఘవస్వామి, తనూజనాయుడు పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు. రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు వినీత్, జ్యోతి సుమారు 90 మందికి వైద్య పరీక్షలు చేశారు. రోగులకు ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. శస్త్రచికిత్స నిమిత్తం 15 మందిని రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో అలమండ దుర్గావెంకట ప్రసాద్, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు, కందుల ప్రభాకరరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి 'స్పందన'కు 11 అర్జీలు


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం

పెద్దాపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో సోమవారం నిర్వహించిన స్పందనకు ఆయా మండలాల నుంచి 11 అర్జీలు వచ్చాయని కార్యాలయ ఏఓ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. భూ సమస్య పరిష్కరించాలని, సర్వే చేయాలని, ఆక్రమణలు తొలగించాలని తదితర సమస్యలపై 11 ఫిర్యాదులు అందాయన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి వారం స్పందన నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి పరిష్కంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఉష, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఎల్‌పీఓ బాలామణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని వినతి


పిఠాపురంలో మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పిఠాపురం: పిఠాపురం నుంచి రాపర్తి వెళ్లే మార్గంలోని నివాస ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఎం నాయకులు కె.చిన్న, కోనేటి రాజు, కె.నాగేశ్వరరావు, మణి, ఎస్.అరుణకుమారి తదితరులు మున్సిపల్ కార్యాయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో రాపర్తి వెళ్లే దారిలోని నివాస ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు సగం పూర్తి చేశారని, మిగిలిన పనులు చేయకుండా వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ పనులను పూర్తి చేసి, స్థానికుల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానికులు సుజాత, దుర్గ, నాగలక్ష్మి, గౌరి, నాగమ్మ, ఎం.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆసరా' చెక్కుల పంపిణీ

సామర్లకోట: వేట్లపాలెంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వి.ప్రశాంతి తెలిపారు. వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాల పరిధిలోని 416 సంఘాలకు నాలుగో విడత ఆసరాగా రూ.3.38 కోట్లు మంజూరు అయ్యిందన్నారు. దీనికి సంబంధించిన చెక్కును వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆ రెండు గ్రామాలకు చెందిన మహిళా సంఘాలకు అందిస్తారన్నారు. ఆయా సంఘాల సభ్యులు హాజరు కావాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గోకవరం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై కె.నాగరాజు సూచించారు. మండలంలోని తిరుమలాయపాలెంలో సోమవారం సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామంలోని ముఖ్యకూడళ్ల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆక్రమణలను ఆపరేం..

- అధికారులను నిలదీసిన కౌన్సిల్ సభ్యులు
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ సమావేశం


సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు రాజశేఖర్, సత్యభాస్కర్


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తులసీ మంగతాయారు

పెద్దాపురం: చెప్పి చెప్పి విసుగుపోతున్నాం.. మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై చర్యల విషయంలో ఎందుకంత నిర్లక్ష్యం.. మున్సిపల్ ఆదాయంపై ఎందుకు దృష్టిసారించడం లేదని అధికారులపై కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. సోమవారం పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్, ముప్పన శ్యామలాంబ, ఆరెళ్లి వీర్రాఘవు మాట్లాడుతూ పట్టణంలో అనేకచోట్ల మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో ఉన్న సిబ్బంది సేవలు వినియోగించుకుని మున్సిపల్ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణంలో నాణ్యత పాటించేలా చూడాలన్నారు. పాత బస్టాండ్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న షాపులు మూసి ఉంటున్నాయని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ అక్కడ షాపులకు వేలం పూర్తయ్యి అద్దెలు చెల్లిస్తున్నారని, ఒక దుకాణం ఖాళీగా ఉందన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కర్ మాట్లాడుతూ జగ్గంపేట రోడ్డులోని పార్కును తిరిగి ప్రారంభించాలని గత సమావేశంలో కోరామని, దానిపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. జగనన్న లే అవుట్‌లో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించాలన్నారు. సాయిప్రసాద్ సమాధానమిస్తూ పార్కును అన్నివిధాలా సిద్ధం చేశామని, త్వరలోనే అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. కౌన్సిలర్ శ్యామలాంబ మాట్లాడుతూ 23వ వార్డులో శ్మశాన వాటిక అభివృద్ధి చేస్తున్నప్పటికీ, రోడ్డుపై ఆక్రమణలపై ఎందుకు దృష్టి సారించడం లేదన్నారు. సత్వరమే ఆక్రమణలు తొలగించాలని, వార్డులో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభించి ప్రహరీ ఏర్పాటు చేయాలన్నారు. ఒకటో వార్డు కౌన్సిలర్ ఆరెళ్లి వీర్రాఘవులు మాట్లాడుతూ పాత పెద్దాపురం రోడ్డులోని ఏలేరు కాలువ వద్ద వ్యర్థాలను వదిలేస్తున్నారని, దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సాయిప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో మున్సిపల్ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై వాడీవేడిగా చర్చ సాగింది. మున్సిపల్ కమిషనర్ పద్మావతి, మేనేజర్ జ్యోతిరాణి, డీఈఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆర్‌ఓ చంద్రశేఖరం, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, కౌన్సిలర్లు సయ్యద్ అమీనాబీబీ, పెంటకోట సత్తిబాబు, గోకేడ అప్పారావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంపీ గీత పరామర్శ


ఉప్పాడలో యల్లాజీని పరామర్శిస్తున్న ఎంపీ వంగా గీత

కొత్తపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలను కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత సోమవారం పరామర్శించారు. ఉప్పాడలో ఎంపీటీసీ మేరుగు యల్లాజీ తండ్రి ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పొన్నాడ మాజీ సర్పంచ్ వడ్డి నూకరాజు అనారోగ్యంతో మృతి చెందగా తన భార్య, మాజీ సర్పంచ్ వడ్డి నాగమణిని, కొత్తమూలపేటకు చెందిన చింతాడ నాగేశ్వరరావు భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను ఎంపీ గీత పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, ప్రముఖ సైకాలజిస్ట్ వడిశెట్టి నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు మదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్


పాదగయ క్షేత్రంలో నిరుపయోగంగా మారిన డ్రింకింగ్ వాటర్ సిస్టమ్

పిఠాపురం: పాదగయక్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు రక్షిత తాగునీరు అందించడానికి దాతలు ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధ పరికరాలు మూలన పడి నిరుపయోగంగా మారాయి. అతిప్రాచీన స్వయంభూ శివాలయం కావడంతో దేశం నలుమూలల నుంచి భక్తులు స్వామి దర్శనానికి వస్తుంటారు. ఆలయంలో అందుబాటులో ఉన్న మంచినీరు అంత స్వచ్ఛమైనది కాకపోవడంతో భక్తుల సౌకర్యార్థం పిఠాపురం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వారు వేలాది రూపాయలు వెచ్చించి డ్రింకింగ్ వాటర్ సిస్టమ్‌ను పురూహూతికా అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసారు. దానిని పర్యవేక్షించాల్సిన సిబ్బంది పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు గురై మూలన పడింది. దీంతో ఆలయంలో రక్షిత తాగునీరు లభించక డబ్బులు పెట్టి కొనుక్కోవలసి వస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి వాటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

కళాకారులకు సత్కారం

ప్రత్తిపాడు: గ్రామంలో సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కంఠస్ఫూర్తి వంశీయుల ఆడపడుచులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి శంఖవరం మండలం కత్తిపూడి విఘ్నేశ్వర సాయిదుర్గా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన 'బతుకు చిత్రం' సాంఘిక నాటకం ప్రేక్షకులను అలరించింది. కాగా సోమవారం నాటకంలో తల్లి పాత్ర పోషించిన నంది అవార్డు గ్రహీత లహరి (గుంటూరు), విశాఖ కళాకారిణి భానుతో పాటు నాటకంలోని పాత్రదారులను శ్రీసత్తెమ్మతల్లి ఉత్సక కమిటీ సభ్యులు శాలువాల, పూలమాలతో సత్కరించారు.

కొనసాగుతున్న విచారణ


సామర్లకోట మసీదు సెంటర్‌లో విచారణ చేస్తున్న డీఎస్పీ లతాకుమారి

సామర్లకోట: స్థానిక మసీదు సెంటర్‌లో రెండో రోజు పోలీసుల దర్యాప్తు కొనసాగింది. ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి స్టేట్ బ్యాంకులో చోరీ ఘటనపై పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో సోమవారం దర్యాప్తు నిర్వహించారు. మసీదు సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఒక ఇల్లును ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు అద్దెకు తీసుకుని అక్కడి నుంచి బ్యాంకులో చోరీకి వెళ్లినట్లు ట్రైనీ డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ ఆదివారం నిర్ధారణకు వచ్చిన విషయం విదితమే. పది రోజుల పాటు ఆ ఇంటిలోనే ఉండి బ్యాంకు రెక్కీ చేసినట్లు నిర్ధారణ అయ్యింది. క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించింది. రాజమహేంద్రవరంలో ఉంటున్న ఇంటి యజమానికి ఫోన్ చేసి నెలకు రూ. మూడు వేల అద్దెకు వారు దిగారు. ఇంటి యజమానికి వచ్చిన ఫోన్ నంబరు ఆధారంగా వివరాలు సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు. ఇంటి సమీపంలో ఉన్న మాంసం దుకాణం యజమాని నుంచి డీఎస్పీ వివరాలు సేకరించారు.

రాపర్తిలో బీజేపీ 'పల్లెకు పోదాం'


ప్రజలకు కేంద్ర పథకాలు వివరిస్తున్న బీజేపీ నాయకులు

పిఠాపురం: మండలంలోని రాపర్తిలో సోమవారం బీజేపీ నాయకులు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ రావూరి సుధ, కాకినాడ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి గండి కొండలరావు, బీజేపీ పిఠాపురం మండలాధ్యక్షుడు పిల్లా ముత్యాలరావు తదితరులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దోనె అచ్యుతరామయ్య, అడబాల శ్రీనివాస్, వెన్నా సుబ్బారావు, కె.రాజ్‌కుమార్, కరణం గంగా భవానీ, దువ్వా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి సన్నిధి.. భక్తజన పెన్నిధి

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు


సామర్లకోట వేణుగోపాలస్వామి ఆలయం వద్ద అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. మాఘ మాసం, మొదటి సోమవారం కావడంతో తెల్లవారు జాము నుంచే రద్దీ నెలకొంది. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయంలోని ఉప ఆలయాలు, ధ్వజస్తంభం, పెద్ద నంది వద్ద పూజలు జరిగాయి. దేవస్థాన అన్నదాన ట్రస్టు నుంచి భక్తులకు అన్నసమారాధన జరిగింది. చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్, సత్యనారాయణమూర్తి, సన్నిదిరాజు వెంకన్న, వేమూరి సోమేశ్వరశర్మలు పూజాదికాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ప్రత్యేకంగా అలంకరించారు.

వేణుగోపాలస్వామి సన్నిధిలో అన్నదానం

స్థానిక పెద్దాపురం రోడ్డు విఘ్నేశ్వరా థియేటర్ ఎదురుగా ఉన్న రాధా సమేత వేణుగోపాలస్వామి (కృష్ణుని గుడి) ఆలయం వద్ద అన్నదానం జరిగింది. ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసు తెలిపారు. సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేశారు. ఆధ్యాత్మిక వేత్త యంద్రు సాయిబాబు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రాజాని తాతారావు, మార్ల రాంబాబు, ప్రసాదుల బాబూరావు, రాజాని శివ, మార్ల రమణ భక్తులకు సేవలందించారు.

జగన్ మాటే గ్యారంటీ

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- చంద్రబాబువి బూటకపు హామీలు


వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, కమిషనర్ వెంకటరావు

కాకినాడ రూరల్: ఎన్నికల మ్యానిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటే ఒక గ్యారంటీ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల్లో భాగంగా కాకినాడ అర్బన్‌లోని 1, 2, 3వ డివిజన్లు, రూరల్‌లోని 11 గ్రామాలకు చెందిన లబ్ధిదారులతో కాకినాడ జేఎన్‌టీయూకే ఎదురుగా గ్రౌండ్‌లో సోమవారం సభ నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నబాబు చివర్లో సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు వచ్చి గ్యారంటీ, షూరిటీ అంటున్నాడని, ఆ మాయల ఫకీరు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సమర్థ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అయితే.. నయవంచకుడు టీడీపీ నేత చంద్రబాబు అని అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 65 ఏళ్లు వచ్చినా పింఛన్ ఇచ్చేవారు కాదని, ఇప్పుడు 60 ఏళ్లకే పెన్షన్ ఇంటికి వస్తుందన్నారు. మంచి ఏదో, చెడు ఏదో తెలుసుకోవాలన్నారు. డ్వాక్రా రుణమాఫీ నాలుగేళ్లుగా ఎంత గొప్పగా అమలు చేశామో మీకందరికీ తెలుసన్నారు.

రాష్ట్రంలో 28 వేల కోట్ల రుణమాఫీ

ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో నాలుగు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.28 వేల కోట్ల డ్వాక్రా రుణమాఫీ చేశామని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన మాటను సీఎం జగన్ నిలుపుకొన్నారు. పాదయాత్రలో ఇక్కడే జగన్ బస చేశారని, ఇప్పుడు రుణమాఫీ కార్యక్రమం ఇక్కడే జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో రూ.160 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. 4,824 డ్వాక్రా సంఘాలకు చెందిన 48,444 మంది లబ్ధి పొందారన్నారు. రూరల్ మండలంలోని 11 గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.22.99 కోట్లు, అర్బన్‌లోని మూడు డివిజన్ల లబ్ధిదారులకు రూ.3.39 కోట్ల పంపిణీకి సంబంధించిన నమూనా చెక్కును ఎమ్మెల్యే వారికి పంపిణీ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, గోపుశెట్టి బాబ్జీ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గగారిన్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి, దూనబోయిన అరుణ, అనుసూరి ప్రభాకర్, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా అధికారి వెంకటరావు

తుని రూరల్: బాలల హక్కులు పరిరక్షణకు డీఆర్‌డీఏ, స్త్రీ శిశు సంక్షేమ అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు పిలుపునిచ్చారు. తుని మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఏపీఎం వై.రాంబాబు అధ్యక్షతన బాల్య వివాహాల నివారణ, బాల బాలికల చట్టాలు, దత్తత కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాల నివారణ, బాలల హక్కులు, పిల్లలు లేని తల్లిదండ్రులు చిన్నారులను దత్తత తీసుకునే పద్ధతులపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అత్యవసరమైతే 1098, 100 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించడం ద్వారా ఆయా సమస్యలను నిరోధించాలన్నారు. బాల్య వివాహాలు, ఆడ పిల్లల అక్రమ రవాణాలతో కలిగే అనార్థాలను వివరించారు. కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో వీఓలకు, వీఓఏలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓలు, వీఓఏలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి

తుని రూరల్: బాల్య వివాహాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత కోరారు. మండలంలోని డి.పోలవరంలో సోమవారం మాజీ సర్పంచ్ చింతల వెంకటరమణ ఆధ్వర్యంలో బేటీ బచోవో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, ఆడపిల్లల ఆవశ్యకత, అంగన్‌వాడీల కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలను వివరించారు. నాయకులు చిటికెల వరహాలబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పిఠాపురం ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.నిహారిక సోమవారం తెలిపారు. పిఠాపురం రూరల్‌లో–1, గొల్లప్రోలు మండలంలో–1, కొత్తపల్లి మండలంలో 4 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. పిఠాపురం మండలం మల్లాంలో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టు ఎస్టీకి కేటాయించారన్నారు. కొత్తపల్లి మండలంలో వాకతిప్పలో బీసీ–ఏకి, కొత్తపల్లి శివారు రవీంద్రపురంలో ఓసీ దివ్యాంగులకు, పొన్నాడ శివారు రామరాఘవపురం ఓసీ, కొత్తపల్లి ఎస్సీ పేటలో ఎస్సీకి, గొల్లప్రోలు రూరల్ చినజగ్గంపేట–2 అంగన్‌వాడీ కేంద్రంలో ఓసీ అభ్యర్థులకు కేటాయించినట్లు తెలిపారు.ఈ పోస్టులకు మహిళలు మాత్రమే అర్హులన్నారు. అభ్యర్థులు 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండి పదో తరగతి పాసై ఉండాలన్నారు. స్థానికతకు సంబంధించి తహసీల్దార్ నుంచి నివాస ధ్రువీకరణ పత్రం పొంది ఉండాలన్నారు. మంగళవారం నుంచి పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 22వ తేదీ లోపు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: స్థానికంగా అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉష తెలిపారు. దీనికి సంబంధించి 22వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పట్టణంలోని శెట్టిపేట–1 అంగన్‌వాడీ వర్కర్ (బీసీ–బీ) పోస్టుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులై, 35 ఏళ్ల లోపు వయస్సు గలవారు అర్హులన్నారు.